రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలనే యోచనకు వ్యతిరేకంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లింలు సోమవారం నిరసన తెలిపారు. రంజాన్ ప్రార్థనల అనంతరం ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. - కంఠేశ్వర్

ఔటర్‌పై టోల్ చార్జీలు పెంపు

నేటి నుంచి అమల్లోకి : ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలను పెంచినట్టు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ తెలిపింది. 2025-26 సంబంధించి ఔటర్ టోల్ చార్జీలను స్వల్పంగా పెంచుతున్నట్టు వెల్లడించింది. పెరిగిన చార్జీలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయని పేర్కొన్నది. వివిధ రకాల వాహనాలను ఆరు క్యాటగిరీలుగా విభజించి టోల్ చార్జీలను నిర్ణయించింది. కారు, జీపు, వ్యాన్ లైట్ వెహికిల్స్‌కు ప్రతి కిలోమీటర్‌కు రూ.10పైసలు పెంచగా, మినీబస్, ఎల్‌సీవీ వాహనాలకు ప్రతి కిలో మీటర్‌కు రూ. 20 పైసలు పెంచింది. దీంతో ఈ టోల్ చార్జీ రూ.2.34 నుంచి రూ.2.44కు పెరిగింది. మినీబస్, ఎల్‌సీవీలకు కిలో మీటర్‌కు రూ.3.77 నుంచి రూ.3.94కు పెంచా రు. 2 యాక్సిల్ బస్సులకు కిలో మీటర్‌కు రూ.6.69 నుంచి రూ.7కు పెంచారు. భారీ సైజు వాహనాలకు కిలోమీటర్ రూ.15.09 నుంచి రూ.15.78కు పెంచింది.

గ్రోత్ కారిడార్ నిర్వహణకే ..

కొత్త టోల్ రేట్లు, నెలవారీ, రోజువారీ పాసులకు సంబంధించిన చార్జీల వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని సూచించింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నిర్వహణలో ఉండే ఓఆర్‌ఆర్‌ను ఐఆర్‌బీ సంస్థ 30 ఏండ్ల కాలానికి లీజుకు తీసుకున్నది.

సీఈఐజీలో ఆంధ్రా అధికారి పాగా?

ఆయన గుప్పిట్లో నాలుగు పోస్టులు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు ప్రధాన తనిఖీ అధికారి (చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జనరల్)లో ఆంధ్రా అధికారులు పాగా వేశారు. తెలంగాణ అధికారుల అవకాశాలను కొల్లగొడుతున్నారు. పైరవీలతో పోస్టులన్నీ వారే ఎగరేసుకుపోతున్నారు. కీలకమైన నాలుగు పోస్టులు ఆంధ్రా అధికారి గుప్పిట్లో ఉండటం గమనార్హం. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (సీఈఐజీ)గా కొనసాగుతున్న అధికారియే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ హైదరాబాద్ (ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్), డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ జనరల్ రూరల్ (ఉమ్మడి మెదక్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ), డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ జనరల్ నిజామాబాద్ (ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్)కు ఒకే అధికారి కొనసాగుతున్నారు. సదరు అధికారి త్వరలోనే రిటైర్మెంట్‌కాబోతున్నారు. సర్కారు పెద్దలను, అధికారులకు మచ్చిక చేసుకుని మళ్లీ అడ్డదారిలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ఆరోపణలొస్తున్నాయి. ఇదే సీటుపై మరో అధికారి కన్నేశారు.

జీపీఎఫ్ ఖాతాల్లోని నగదును బదిలీ చేయండి

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీ అయిన, పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయుల జడ్పీ జీపీఎఫ్ ఖాతాల్లోని నగదును బదిలీ చేయాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్(టీఎస్ జీహెచ్ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. బదిలీ అయిన వారు తమ జీపీఎఫ్ ఖాతాలను ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాలకు బదిలీచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని, జీపీఎఫ్ బదిలీచేయకపోవడంతో హెచ్ఎంలు ఇబ్బందిపడుతున్నారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శులు గిరిధర్, కోశాధికారి తుకారం పేర్కొన్నారు. జీపీఎఫ్ బదిలీచేయకపోవడంతో ఇబ్బందులొస్తున్నాయని సో మవారం ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు.

రేపటి నుంచి జేఈఈ మెయిన్-2 పరీక్షలు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ఐఐటీలు, ఎన్ఐటీల్లో బీటెక్, బీఆర్క్, బీప్లానింగ్ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్-2 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమై 9వ తేదీతో ముగుస్తాయి. 2,3,4,7,8 తేదీల్లో బీఈ, బీటెక్ అభ్యర్థులకు, 9న బీప్లానింగ్, బీఆర్క్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి. ఆన్‌లైన్‌లో జరగనున్న ఈపరీక్షలకు 9 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఈనెల 4 వరకు పేపర్లవారీగా అడ్మిట్‌కార్డులను వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నది.

కాంగ్రెస్.. 'బీసీ' డ్రామా

ఓవర్ టు ఢిల్లీ!

- అసమగ్రంగా బీసీ రిజర్వేషన్ బిల్లులు
- తప్పుడు గణాంకాలతో రూపకల్పన
- కేంద్ర ఆమోదం కష్టమని తెలిసీ గేమ్
- అనుయాయులతో ఢిల్లీ కేంద్రంగా ధర్నా నాటకానికి ప్లాన్
- న్యాయ వివాదాలు తలెత్తక ముందే 9వ షెడ్యుల్‌లో చేర్చాలంటూ మోసం

హైదరాబాద్, మార్చి31 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కారు తప్పుల తడకగా కుల గణన నిర్వహించింది. అసంబద్ధ గణాంకాలతో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతున్నామంటూ అసమగ్రంగా బిల్లులు రూ పొందించి అసెంబ్లీలో ఆమోదించింది. ఇప్పుడవి ఎక్కడున్నాయో? కూడా తెలియదు. గవర్నర్ ఆమోదానికి పంపారో? లేదో? కూడా స్పష్టతలేదు. రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు సర్కారు జీవోలను కూడా ఇవ్వలేదు! ఒకవేళ ఇచ్చినా అమలు కష్టమేనన్న సంగతి కాంగ్రెస్‌కు తెలుసు. పైగా రిజర్వేషన్లు, బీసీల కులగణనను ఆది నుంచీ అడ్డుకుంటున్న బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నది. ఇవన్నీ తెలిసినా 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ కాంగ్రెస్ సర్కారు ఢిల్లీ కేంద్రంగా ధర్నా పేరిట కొత్త డ్రామాకు తెరలేపింది. ఇందుకోసం పలు అనుకూల సంఘాల నేతలను ప్రత్యేక రైళ్లలో పంపింది. కేవలం బీసీలను వంచించేందుకు, తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు, రిజర్వేషన్ల అంశాన్ని తప్పించుకునేందుకే ఈ డ్రామాలు తప్ప మరేమీ కాదని పలు కుల సంఘాలు బాహాటంగానే విమర్శిస్తున్నాయి. చట్టం చెప్తున్నదేమిటంటే బీసీలకు సంబంధించి విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల కల్పన, పెంపు అనేది రాష్ట్ర బీసీ కమిషన్ ఇచ్చే నివేదికలు, సిఫారసుల మేరకే జరగాలి. స్థానిక సంస్థల రిజర్వేషన్ అనేది డెడికేటెడ్ కమిషన్ సిఫారసుల మేరకు అమలు చేయాలి. కానీ కాంగ్రెస్ ప్రస్తుతం డెడికేటెడ్ కమిషన్ సిఫారసులతోనే బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను పెంచింది. చట్టం ముందు ఇవి ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచే ప్రసక్తే లేదని న్యాయకోవిదులే వెల్లడిస్తున్నారు.

తప్పించుకునేందుకు నాటకం

కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లులు ఎక్కడున్నాయో? ఇప్పటికీ తెలియదు. బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్ నివేదికలను అధికారికంగా శాసనసభ, శాసనమండలిలో ఎక్కడా సర్కారు వెల్లడించలేదు. బిల్లులను అమల్లోకి తెస్తూ ఎలాంటి జీవోలను కూడా ఇవ్వలేదు. వాస్తవానికి రాష్ట్ర చట్టాల అమలుకు కేంద్ర అనుమతి అవసరం లేదు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అమలు చేయకుండానే, 9వ షెడ్యూల్ పేరిట కొత్త డ్రామాకు తెరతీసింది. న్యాయసమీక్ష పరిధిలోకి రాకుండా రాజ్యాంగ సవరణ చేసి బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్న నాటకానికి తెరలేపింది. 9వ షెడ్యూల్‌లో చేర్చినంత మాత్రాన పూర్తిగా రక్షణ లభించినట్టు కాదని గతంలోనే సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అయినా కాంగ్రెస్ కొత్త డ్రామాకు తెరతీసింది. తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు, బీసీలకు ఇచ్చిన హామీని అటకెక్కించేందుకు ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ ఇలా చేస్తున్నదని బీసీ సంఘాల నేతలే విమర్శిస్తున్నారు. కేంద్రంలో ఉన్నది బీజేపీ, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోదని, అది తెలిసీ కాంగ్రెస్ డ్రామా ఆడుతున్నదని చెప్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే ముందు రిజర్వేషన్లను అమలు చేయాలని, కోర్టు వివాదాలు తలెత్తితే అప్పుడు డిమాండ్ చేయవచ్చని, కానీ అవేవీ చేయకుండానే 9వ షెడ్యూల్ ప్రస్తావన తేవడం ఆ పార్టీ మోసపూరిత విధానానికి నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. కొన్ని బీసీ సంఘాలను పోగుచేసి, రైళ్లలో ఢిల్లీకి పంపి ధర్నా పేరిట నాటకాలకు దిగడం సిగ్గుచేటని మండిపడుతున్నారు.

సర్కారు ప్రోద్బలంతో హస్తినకు

సర్కారు ప్రోద్బలంతోనే కొన్ని బీసీ సంఘాలు ప్రస్తుతం ఢిల్లీకి వెళ్లాయని బీసీ మేధావులు, పలు కుల సంఘాల నేతలు బాహాటంగానే చెప్తున్నారు. అనుకూలమైన మేధావి వర్గాన్ని, కులసంఘాల నేతలను ముందుపెట్టి ఇంటింటి సర్వే, బిల్లుల రూపకల్పన మంత్రాంగాన్ని నడిపిస్తూ వచ్చిందని భగ్గుమంటున్నారు. బీసీ రిజర్వేషన్లను అమలులోకి తేకముందే కొన్ని సంఘాలు హడావుడి చేస్తూ, సర్కారుకు జేజేలు కొడుతున్నాయని విమర్శిస్తున్నారు. డ్రామాలో భాగంగానే రేపు (బుధవారం) ఢిల్లీలో బీసీల పోరుగర్జన చేపట్టారని ఆరోపిస్తున్నారు.

బీసీల రిజర్వేషన్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

హైదరాబాద్, మార్చి31 (నమస్తే తెలంగాణ): బీసీల రిజర్వేషన్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖను రాశారు. బీసీలకు విద్య, ఉపాధి, ఉద్యోగ, స్థానికసంస్థల్లో రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుల అమలు కోసం.. బీసీ సంఘాలతోపాటు, విశ్రాంత న్యాయమూర్తులతో చర్చించాలని సూచించారు. జీవోలను జారీచేసి రిజర్వేషన్లను అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు.

'రాజీవ్ యువ వికాసం' పకడ్బందీగా అమలు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాసం పథకాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. సోమవారం ప్రజాభవన్ నుంచి ఆయన చీఫ్ సెక్రటరీ, సెక్రటరీలు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి రూ. పదివేల కోట్లు ఖర్చు చేస్తున్నదని పేర్కొన్నారు. ఏప్రిల్ 14 వరకు దరఖాస్తుల గడువు పెంచాలని ఆదేశించారు.

ఇక ఇన్‌స్టంట్ బీర్ కేఫ్‌లు!

› మొదటిపేజీ తరువాయి...

విధివిధానాలు రూపొందించింది. హైదరాబాద్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది కనీసం 100 మైక్రో బ్రూవరీలనైనా ఏర్పాటు చేసే దిశగా ఔత్సాహిక వ్యాపారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను నిర్దేశించినట్టు తెలిసింది. మైక్రో బ్రూవరీల లైసెన్స్ ఫీజు ప్రస్తుతం రూ.3 లక్షలు ఉండగా.. దాన్ని రూ.5 లక్షలకు పెంచాలని నిర్ణయించినట్టు అధికారులు చెప్తున్నారు. తెలంగాణలో ప్రతి 13వేల మందికి ఒకటి చొప్పున కేఫ్ ఏర్పాటు చేసే విధంగా ఎక్సైజ్ నిబంధనలను సవరిస్తున్నట్టు తెలిసింది.

తాజా తాజా బీరు

రాష్ట్రంలో ప్రస్తుతం ఆరు బ్రూవరీలు ఉన్నాయి. ఈ బ్రూవరీల నుంచి ఏటా 6,500 లక్షల బీర్ కేసులు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 2,500 లక్షల కేసులు ఒక్క హైదరాబాద్‌లోనే విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ నివేదికలు చెప్తున్నాయి. మైక్రో బ్రూవరీ నుంచి అప్పటికప్పుడు తయారై నేరుగా గ్లాసులోకే బీరు వచ్చేస్తుంది. కాగా, నివాస ప్రాంతాల్లో 1,000 లీటర్ల ఫ్రెష్ బీర్‌ను ఉత్పత్తి చేయగలిగి, విక్రయించే సా మర్థ్యం ఉన్నచోట మైక్రో బ్రూవరీలను అనుమతించేలా నిబంధనలు సవరిస్తున్నట్టు తెలుస్తుంది.

సొమ్ము బీఆర్‌ఎస్‌ది.. సోకు కాంగ్రెస్‌ది

- ఫిలిప్పీన్స్‌కు బియ్యంపై మంత్రి ఉత్తమ్ గొప్పలు
- అది బీఆర్‌ఎస్ హయాంలో ఉత్పత్తయిన ధాన్యమే
- కాకినాడ పోర్టు నుంచి 12,500 టన్నుల బియ్యం ఎగుమతిని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : 'సొమ్మొకరిది.. సోకు మరొకరిది!' ఈ సామెత ప్రస్తుత కాంగ్రెస్ సర్కారుకు సరిగ్గా సరిపోతుందేమో! బీఆర్‌ఎస్ హయాంలో వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాలతో ధాన్యం ఉత్పత్తి పెరుగగా ఆ ధాన్యాన్ని ఇప్పుడు విదేశాలకు ఎగుమతి చేస్తూ ప్రభుత్వం సొమ్ము చేసుకుంటున్నది. పైగా ఇదేదో తమ ఘనకార్యం అన్నట్టుగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రచారం చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిలిప్పీన్స్‌కు లక్షల టన్నుల బియ్యం సరఫరా చేస్తామని ఒప్పుకొన్న పౌరసరఫరాల శాఖ, ఇందులో భాగంగా సోమవారం 12,500 టన్నుల బియ్యం ఎగుమతిని కాకినాడ పోర్టు నుంచి ప్రారంభించింది. దీన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అయితే గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం నుంచే ఎగుమతి చేయడం గమనార్హం. 2022-23లో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాసంగిలో 60 లక్షల టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసింది. ఇందులో కాంగ్రెస్ సర్కారు 38 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేసింది. ఈ వేలంలోని ధాన్యాన్ని బిడ్డర్లు ఎత్తకపోవడంతో ఇదే ధాన్యాన్ని ఇప్పుడు బియ్యంగా మార్చి విదేశాలకు ఎగుమతి చేస్తున్నది. బిడ్డర్ల నుంచి ధాన్యం ఎత్తించడంలో, డబ్బులు వసూలు చేయడంలో విఫలమైన పౌరసరఫరాల సంస్థ ఇప్పుడు అదే బియ్యాన్ని ఎగుమతి చేసి ఏదో గొప్ప పని చేసినట్టుగా చెప్పుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాడు ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా అధిక మొత్తంలో ధాన్యాన్ని వేలం వేసి, అదీ సక్సెస్ చేయకుండా ఇప్పుడు విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల పౌరసరఫరాల సంస్థకు నష్టమే తప్ప లాభం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నూక శాతం 5కు తగ్గించడం కోసం మిల్లర్లకు టన్నుకు రూ.3 వేల ప్రోత్సాహం, మిల్లుల నుంచి పోర్టు వరకు రవాణా చార్జీల భారం ఇలా అన్నీ పౌర సరఫరాల సంస్థపైనే పడుతున్నాయి. ఫిలిప్పీన్స్‌కు టన్నుకు రూ.36 వేలకు విక్రయించింది. ఎఫ్‌సీఐ ఇచ్చే ధరకే ఫిలిప్పీన్స్‌కు ఇస్తున్నారు. దీంతో నూకశాతం తగ్గింపు భారం, రవాణా భారం పౌరసరఫరాల సంస్థపైనే పడుతున్నది. దీనివల్ల నష్టమే తప్ప లాభం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో లేఖల యుద్ధం!

- మంత్రివర్గంలో చోటు కోసం హస్తం నేతల పోటాపోటీ లెటర్లు
- వర్గాలు, జిల్లాలవారీగా విడిపోయిన ప్రజాప్రతినిధులు
- మొన్న దళిత ఎమ్మెల్యేలు.. నిన్న గిరిజన లంబాడీ ఎమ్మెల్యేలు
- తాజాగా రంగారెడ్డి నేతల లేఖ
- లేఖపై సంతకం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



హైదరాబాద్, మార్చి 31(నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణ దరిమిలా కాంగ్రెస్‌లో లేఖల యుద్ధం కొనసాగుతున్నది. తమ కంటే తమకు పదవి ఇవ్వాలంటూ అధికార పార్టీ నేతలు పోటాపోటీగా అధిష్ఠానానికి లేఖాస్త్రాలు సంధిస్తున్నారు. వర్గాలు, జిల్లాలవారీగా విడిపోయిన నేతలు తమ బలాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ మొన్న ఎస్సీ ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి లేఖ రాయగా.. ఆ తర్వాత తమకెందుకు ఇవ్వరంటూ ఎస్టీ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. వర్గాలవంతు పూర్తికాగా తాజాగా జిల్లాలవారీగా నేతలు రంగంలోకి దిగారు. అందులో భా గంగా తాజాగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి లేఖ రాశారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేకు కచ్చితంగా ఒక మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లేఖాస్త్రం సంధించారు. ఈ లేఖపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం సంతకం చేసినట్టు తెలిసింది. ఈ లేఖను అదే జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి ఢిల్లీకి వెళ్లి స్వయంగా అధిష్ఠానానికి అందించినట్టు తెలిసింది. ఇలా ఒకరి తర్వాత ఒకరు మంత్రి పదవుల కోసం అధిష్ఠానానికి వరుసగా లేఖలు రాయడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

అధిష్ఠానంపై నిరసన గళం

మంత్రివర్గ విస్తరణ దాదాపుగా ఖాయం కావడంతో రేసులో వెనుకపడొద్దనే ఉద్దేశంతో ఒక్కొక్కరుగా అధిష్ఠానంపై నిరసన గళం వినిపిస్తున్నారు. క్యాబినెట్‌లో ఆరు ఖాళీలు మాత్రమే ఉండటం ఒక్కో పదవికి అరడజను మంది పోటీలో ఉండటంతో ఎవరికి వారు ముందుగానే జాగ్రత్త పడుతున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. అందులో భాగంగానే తమ మనుసులో మాటను అధిష్ఠానం ముం దు పెట్టేందుకు లేఖాస్త్రాలు సంధిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే మంత్రివర్గంలో చోటు దక్కించుకోబోయే కొందరి పేర్లు బయటకు వచ్చాయి. ఇందులో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. దీంతో పార్టీలోని వీరి ప్రత్యర్థి వర్గాలు అలర్ట్ అయ్యాయి. మాల వర్గానికి చెందిన వివేక్ వెంకటస్వామి పేరు ప్రచారంలోకి రావడంతో మాదిగ వర్గానికి చెందిన సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు వ్యతిరేకంగా పావులు కదిపారు. ఇప్పటికే మాలలకు డిప్యూటీ సీఎం పదవితో పాటు స్పీకర్ పదవి కూడా ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ వారికే మంత్రి పదవి ఇస్తే తామేం కావాలంటూ మాదిగ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తున్నారు. అందుకే ఈసారి మంత్రివర్గంలో మాలలకు కాకుండా మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలె యాదయ్య, తోట లక్ష్మీకాంతారావు, మందుల సామేలు డిమాండ్ చేశారు. అంతటితో ఆడకుండా నేరుగా అధిష్ఠానంపై లేఖాస్త్రాన్ని ఎక్కుపెట్టారు. ఇక తామెందుకు తక్కువ తిన్నామన్నట్టు లంబాడీ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. లంబాడీ నేతలు బాలు నాయక్, రాంచందర్ నాయక్, నెహ్రూ నాయక్, కేతావత్ శంకర్.. సీఎంను కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు అధిష్ఠానానికి కూడా లేఖ రాశారు. ఇక తాజాగా రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తమ జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని మరో లేఖ సంధించారు. తమలో ఎవరికైనా ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలంటూ మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి అధిష్ఠానానికి లేఖ రాశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం సంతకం చేయడం కొసమెరుపు. వీరందరి లేఖలతో ఇప్పుడు అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది.

సీఎం పర్యటనకు రాజగోపాల్‌రెడ్డి డుమ్మా

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ఉగాది పండుగ రోజు హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన పర్యటనకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దూరంగా ఉన్నారు. త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని, అందులో రాజగోపాల్‌రెడ్డికి బెర్త్ ఖరారైందని ప్రచారం జరుగుతున్న సమయంలో సీఎం రేవంత్ పాల్గొన్న బహిరంగ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లంతా హాజరైనప్పటికీ రాజగోపాల్‌రెడ్డి మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఇది నల్లగొండ జిల్లా రాజకీయాలతోపాటు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి విషయంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డికి, రాజగోపాల్‌రెడ్డికి మధ్య పోటీ ఏర్పడటం.. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే తన సతీమణి పద్మావతికి కూడా మంత్రి పదవి ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ పట్టుపట్టిన విషయం తెలిసిందే. అందుకే ఉత్తమ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరుకాలేదని చర్చ నడుస్తున్నది.

హైదరాబాద్‌లో వ్యాన్‌గార్డ్ జీసీసీ

హైదరాబాద్, మార్చి 31(నమస్తే తెలంగాణ): ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన వ్యాన్‌గార్డ్ కంపెనీ..దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ)ని ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించి వ్యాన్‌గార్డ్ ప్రతినిధుల బృందం..రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం కంపెనీ సీఈవో సలీం రామ్‌జీ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో నెలకొల్పబోతున్న జీసీసీ ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్నట్లు, భవిష్యత్తులో ఈ సెంటర్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. వచ్చే నాలుగేండ్లలో ఈ సెంటర్‌లో 2,300 నుంచి 2,500 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా అనలిటిక్స్, మొబైల్ ఇంజినీరింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో ఇందుకు అవసరమైన ఇంజినీర్లను తక్షణమే నియమించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవన నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణముందని సలీం అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను కలిగివున్న సంస్థ..అంతర్జాతీయంగా 50 మిలియన్లకు పైగా పెట్టుబడిదారులకు తమ సేవలు అందిస్తుంది.

రెనో చేతికి నిస్సాన్ వాటా

న్యూఢిల్లీ, మార్చి 31: భారతీయ తయారీ జాయింట్ వెంచర్ రెనాల్ట్ నిస్సాన్ ఆటోమోటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఎన్ఏఐపీఎల్)లో నిస్సాన్‌కున్న 51 శాతం వాటాను కొనేస్తున్నట్టు సోమవారం రెనాల్ట్ (రెనో) ప్రకటించింది. అంతర్జాతీయ ఒప్పందంలో భాగంగానే ఇది జరుగబోతున్నది. అయితే ఎంతకు కొంటున్నదన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. కాగా, ఈ జాయింట్ వెంచర్‌లో చెన్నై ప్లాంట్ నడుస్తుండగా, ఇక్కడ రెనాల్ట్, నిస్సాన్ కార్లు తయారవుతున్నాయి.

ఇండియన్ బ్యాంక్ వడ్డింపులు

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్..రెపో రేట్లతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రుణాలపై వడ్డీ రేటు 9.05 శాతానికి చేరుకున్నది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రిటైల్, గృహ, ఇతర రుణాలు మరింత భారంకాబోతున్నాయి. పెరిగిన వడ్డీరేటు గురువారం నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది.

వాణిజ్య

చిన్న షేర్లు.. పెద్ద లాభాలు



- 2024-25లో రిటైల్ ఇన్వెస్టర్లకు జోష్
- 8 శాతం ఎగిసిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ
- 6 శాతం పుంజుకున్న మిడ్‌క్యాప్ ఇండెక్స్
- 5 శాతం వృద్ధితో సరిపెట్టుకున్న సెన్సెక్స్

న్యూఢిల్లీ, మార్చి 31: సోమవారం (మార్చి 31)తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మదుపరులకు చిన్న షేర్లు పెద్ద లాభాలనే పంచిపెట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు పరుగులు పెట్టాయి మరి. రిటైల్ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులకు దిగడంతో చిన్న, మధ్యశ్రేణి స్టాక్స్ విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ క్రమంలోనే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3,471.79 పాయింట్లు లేదా 8 శాతం పుంజుకున్నది. మిడ్‌క్యాప్ సూచీ సైతం 2,209 పాయింట్లు లేదా 5.61 శాతం ఎగిసింది. ఇదే సమయంలో బీఎస్ఈ లార్జ్‌క్యాప్ సూచీ సెన్సెక్స్ మాత్రం 5.10 శాతం మేరకే పెరిగింది. గడిచిన ఏడాది కాలంలో 3,763.57 పాయింట్లు అందిపుచ్చుకున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

ఆఖర్లో ఉత్సాహంగా..

మార్చి నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. అంతకు ముందు వరుసగా 5 నెలల (అక్టోబర్-ఫిబ్రవరి)పాటు సూచీలు పతనమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మార్చి నెల ఇన్వెస్టర్లు సెల్లింగ్ ప్రెషర్ నుంచి బయ్యింగ్ మోడ్‌లోకి రావడం మార్కెట్ సెంటిమెంట్‌ను ఎంతగానో పెంచిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఒక్క నెలలోనే సెన్సెక్స్ 4,216.82 పాయింట్లు లేదా 5.76 శాతం పెరగడం గమనార్హం. అలాగే స్మాల్‌క్యాప్ 3,555.23 పాయింట్లు లేదా 8.25 శాతం, మిడ్‌క్యాప్ 2,939.10 పాయింట్లు లేదా 7.61 శాతం ఎగబాకాయి. ఫలితంగా అప్పటిదాకా వాటిల్లిన నష్టాలు కనుమరుగైపోయాయి. నిజానికి విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతున్నా.. దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐ)తోపాటు, రిటైల్ ఇన్వెస్టర్లు అండగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈక్విటీలు ఆకర్షణీయ ప్రదర్శననే కనబర్చగలిగాయి. అయితే మార్చి ద్వితీయార్ధంలో ఎఫ్ఐఐలు కూడా తిరిగి పెట్టుబడులపట్ల ఆసక్తి కనబర్చడం, ఈక్విటీల్లోకి నిధుల వరదను పారించడం కూడా కలిసొచ్చిందని నిపుణులు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు.

ఆల్‌టైమ్ హైలో..

2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈ లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలన్నీ ఆల్‌టైమ్ హై రికార్డులను నమోదు చేశాయి. లార్జ్‌క్యాప్ ఇండెక్స్ సెన్సెక్స్ నిరుడు సెప్టెంబర్ 27న మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి 85,978.25 పాయింట్లను తాకింది. ఇక సెప్టెంబర్ 24న మిడ్‌క్యాప్ సూచీ 49,701. 15 పాయింట్ల గరిష్ఠాన్ని అందుకున్నది. డిసెంబర్ 12న స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 పాయింట్లను చేరింది. ఇక బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో గత ఏడాది సెప్టెంబర్‌లోనే రూ.478 లక్షల కోట్లకు వెళ్లింది. అయితే అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రావడం, పరస్పర సుంకాల హెచ్చరికలు చేయడం.. భారత్‌సహ ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. దీంతో తర్వాతి రోజుల్లో పరుగులకు బ్రేక్ పడ్డట్టైంది. కాగా, 2023-24లో బీఎస్ఈ సెన్సెక్స్ 14,659. 83 పాయింట్లు లేదా 24.85 శాతం, మిడ్‌క్యాప్ 15,013.95 పాయింట్లు లేదా 62.38 శాతం, స్మాల్‌క్యాప్ 16,068.99 పాయింట్లు లేదా 59.60 శాతం పెరిగాయి.

అంకుర హాస్పిటల్స్‌లో ఏడీబీ పెట్టుబడి

హైదరాబాద్, మార్చి 31: హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా హాస్పిటల్ సేవలు అందిస్తున్న అంకుర హాస్పిటల్స్‌లో ఏడీబీ రూ.165 కోట్ల పెట్టుబడులు పెట్టింది. వ్యూహాత్మకంగా వచ్చిన ఈ పెట్టుబడులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం వినియోగించనున్నట్టు ప్రకటించింది. ఏడీబీ నుంచి వచ్చిన నిధులను పీడియాట్రిక్, మెటర్నిటీ, గైనకాలజీ సేవలను మరింత విస్తరించడానికి, రోగులకు అత్యున్నత ప్రమాణాలతో సేవలు అందించడానికి వినియోగించనున్నట్టు అంకుర హాస్పిటల్స్ ఫౌండర్, ఎండీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. కొత్తగా మరిన్ని నగరాల్లో నూతన ఆసుపత్రులను నెలకొల్పబోతున్నట్టు ఆయన ప్రకటించారు.

బాష్‌కు ఐటీ నోటీస్

న్యూఢిల్లీ, మార్చి 31: టెక్నాలజీ సేవల సంస్థ బాష్ లిమిటెడ్‌కు ఆదాయ పన్ను శాఖ షాకిచ్చింది. 2022-23 అసెస్మెంట్ ఏడాదికిగాను రూ.20 కోట్ల డిమాండ్ నోటీస్ జారీ చేసింది. 2022-23 ఏడాదికిగాను రూ.18,36,85,366 డిమాండ్‌తోపాటు రూ.1,80,14,645 వడ్డీ కలుపుకొని మొత్తంగా రూ.20 కోట్ల డిమాండ్ నోటీసు వచ్చినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఐటీ శాఖ జారీ చేసిన నోటీస్‌పై అప్పీల్‌కు వెళ్లే ఆలోచనలో సంస్థ ఉన్నది.